# విడిన బంధం

అది కల్పనకు తొలిరేయి. భర్త రాక కోసం ఎదురుచూస్తోంది, ఆ గదిలో. పెళ్ళి జరిగిందే కానీ, ఇంతవరకూ ఆమె భర్త మొహం కూడా సరిగ్గా చూడలేదు. ఆతనితో రెండు మాటలు కూడా మాట్లాడలేదు.

బాలీబాలని సంసారంలో పుట్టింది కల్పన. చదివిన కొద్దిపాటి చదువుతో ప్రైవేటు స్కూల్లో పని చేస్తోంది. కోరినంత కట్నాలు ఇచ్చుకోలేక, పిల్ల నచ్చక. ఇంకా రకరకాల కారణాలతో పెళ్ళికి చాలా కాలయాపన జరిగి చిట్టచివరికి సరిపెట్టుకుంటున్న సంబంధమిది. అతడు ఏదో ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు. సంబంధం కుదిరిన నెల రోజులకి పెళ్ళి జరిగింది.

కానీ, కల్పన తండ్రి ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. జరిగిన ఈ విషయాలన్నీ మననం చేసుకుంటూండగానే రేయి కరిగిపోతోంది. రేయి గడుస్తూన్న కొద్దీ కల్పనలో ఆందోళన మొదలైంది. ఒకవేళ తాగి వస్తాడేమో అని, మరి కొంత సేపు గడిచింది తొలిరేయి భార్య దగ్గరకు రాని భర్తను గురించి ఏమనుకోవాలో అర్థం కాలేదు. నిరాశా నిట్టూర్పుల నడుమ రేయి కరిగిపోయింది.

ఉదయం కల్పన మనస్సు భారంగా మేల్కొంది ఇంట్లో కలకలానికి. అందరి మొహాల్లోనూ ఆందోళన కనిపిస్తోంది. ఏం జరిగిందో

అర్థం కాలేదు కల్పనకు. వాళ్ళు తనకు వినబడకూడదని ఎంత జాగ్రత్త పడ్డా ఒక్క క్షణంలో అర్థం చేసుకుంది జరిగిందేమిటో, తనమెళ్ళో తాళి కట్టిన భర్త అనే వ్యక్తి పక్కవారింటి కోడలిని లేవదీసుకు పోయాడట రాత్రికి రాత్రి- ఆవిడ దగ్గరున్న బంగారంతోసహా మాయమైనారు. కల్పన మనస్సు ఛీత్కారం చేసింది.

ఆ పుణ్యానికి తనని పెళ్ళెందుకు చేసుకోవాలి? ఆమెకు బాధ, ఆవే దన పోటీపడి కన్నీరుగా ప్రవహించాయి.

మామగారు దగ్గరకు వచ్చి అనునయించారు. "బాధ పడకమ్మా"

ఆ దౌర్భాగ్యుడు పోతేపోనీ, మా రెండో పిల్లాడు వేణుకూడా నీ ఈడుకు సరిపోతాడు వాడితో నీకు పెళ్ళి జరిపిస్తాను.

కల్పనకు ఆ మాటలు కర్ణకఠోరంగా, వికృతంగా వినిపిస్తుంటే చాలా నిదానంగా అంది. "మామయ్యగారూ! మీకు నా మీద ఉన్న ప్రేమకూ, అభిమానానికి, దయకూ చాలాకృతజ్ఞురాల్ని. కానీ, అవి స్వీక రించడానికి నేను సిద్ధంగా లేను. ఎందుకంటే ఒకసారి మొగుడిగా నా మెళ్ళో తాళి కట్టిన వ్యక్తికి తమ్ముడైన వాడు నాకు మరిది అవుతాడు.

"అయినా, ఈ ఇల్లూ, ఈ వాతావరణం- ఇవేవీ నా మనస్తత్వానికి సరిపడవు. నే వెళుతున్నాను. ఈ ప్రపంచంలో బతకగల నన్నధైర్యం నాకు పూర్తిగా ఉంది...." విసురుగా ఆ ఇంటి గుమ్మాన్ని దాటుతున్న కల్పనను అందరూ విభ్రాంతిగా చూస్తుండిపోయారు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 1-10-86)